నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్
5 | నిజామాబాద్, శనివారం 30 మార్చి 2024 | ADILABAD

ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌కి వినతి పత్రం ఇస్తున్న సంఘం నాయకులు(ఫైల్)

సీఆర్టీలకు అందని వేతనాలు

● ఐదు నెలలుగా తప్పని ఎదురుచూపులు
● ఉన్నతాధికారులను కలిసినా ఫలితం శూన్యం ● ఇబ్బందుల్లో ఉద్యోగులు

నిర్మల్ టౌన్, మార్చి 29: జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న సీఆర్టీలకు ఐదు నెలలుగా వేతనాలు అందడం లేదు. చాలీచాలని వేతనాలతో తమకు ప్రతినెల 1వ తారీఖే వేతనాలు అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కానీ ఆచరణలో విఫలమైందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మల్ జిల్లాలో 17 గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉండగా, 147 మంది సీఆర్టీలు పని చేస్తున్నారు. రెగ్యులర్ టీచర్లతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నా, వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతి ఏడాది వీరిని జులై మాసంలో రెన్యువల్ చేస్తున్నది. ప్రతి నెలా రూ.28,977 వేతనం ఇస్తున్నది. కాగా, గత అక్టోబర్ నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నట్లు సీఆర్టీలు చెబుతున్నారు. వేతనాలు రాక ఇంటి అద్దె , పిల్లల చదువులు, ఇతర అవసరాలకు డబ్బులు లేక అప్పులు తెచ్చి సర్దుకుంటున్నట్లు చెబుతున్నారు.

నిధులు విడుదలైనా..

జిల్లా వ్యాప్తంగా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీలకు ప్రభుత్వం ఇటీవలే వేతనాల నిధులు విడుదల చేసింది. జీవో విడుదల చేసినా, అధికారులు మాత్రం సీఆర్టీల ఖాతాలో వేతనాలు జమ చేయడం లేదని తెలుస్తుంది. ఇప్పటికే సీఆర్టీలు, ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నేతలు కలిసి జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవోకు విన్నవించినట్లు తెలిపారు, అయినా ఇప్పటివరకు జమ కాలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, వేతనాలు జమచేయాలని సీఆర్టీలు కోరుతున్నారు.

ఖాతాలో జమ చేయాలి

జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీలకు ఐదు నెలల నుంచి వేతనాలు అందడం లేదు. ప్రభుత్వం అన్ని జిల్లాలకు వేతనాలు విడుదల చేస్తూ జీవో కూడా జారీ చేసింది. స్థానిక అధికారులు వేతనాలు సీఆర్టీల బ్యాంకు ఖాతాల్లో జమ చేయలేదు. ఇప్పటికే ఉన్నతాధికారులకు విన్నవించాం. ఇప్పటికైనా వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలి. సీఆర్టీలకు న్యాయం చేయాలి.

-రాజేశ్ నాయక్, ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు

ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం..

జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న మాకు ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వలేదు. దీంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నం. మాకు తక్కువ వేతనాలే ఉన్నాయి. ప్రతినెల ఒకటో తేదీనే వేతనం అందిస్తే మరింత ఉత్సాహంతో పనిచేస్తాం. పిల్లల చదువు, ఇంటి అద్దె, ఇతర అవసరాలు జీతం వస్తేనే తీరుతయ్. లేకుంటే అప్పులు చేయాల్సి వస్తుంది.

-బానోతు చందు, సీఆర్టీ, నిర్మల్

కవాతులో పాల్గొన్న డీఎస్పీ, సీఐ, కేంద్ర బలగాలు

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి

ఎదులాపురం,మార్చి 29: ఆదిలాబాద్‌లో ప్రశాంత వాతావరణంలో లోక్‌సభ ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆదిలాబాద డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు టూ టూన్ పరిధిలోని భాగ్యనగర్, తాటిగూడ, క్రాంతినగర్, మహాలక్ష్మీవాడలో కేంద్ర బలగాలతో శుక్రవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకే ఇలా పోలీస్ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మద్యం, డబ్బులతో ప్రలోభాలకు గురికాకుండా చూస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఐ ఏ.అశోక్, ఎస్ఐలు లాల్‌సింగ్‌నాయక్, రమణారెడ్డి ఉన్నారు.

లక్ష్మణచాంద మండల కేంద్రంలో ఇంటి పన్ను వసూలు చేస్తున్న కార్యదర్శి విక్రంరాజు, సిబ్బంది

భైంసా మండలం ఇలేగాంలో ఇంటి పన్ను వసూలు చేస్తున్న కార్యదర్శి వంశీ

మిగిలింది రెండు రోజులే..

ముగుస్తున్న 2023-24 ఆర్థిక సంవత్సరం

● పన్నుల వసూలు టార్గెట్ చేరుకోని పంచాయతీలు ● రూ.10.37 కోట్లకు గాను రూ.8.75 కోట్లే వసూలు ● ఇంకా రావాల్సిన మొత్తం రూ.1.62 కోట్లు
● జిల్లాలో 396 గ్రామపంచాయతీలు ● 1,80,916 నివాస గృహాలు

నిర్మల్, మార్చి 29(నమస్తే తెలంగాణ): పన్నుల వసూలులో ఈ సారి జిల్లా పంచాయతీ విభాగం కాస్త వెనుకబడింది. నెల రోజుల క్రితం వరకు దూకుడు ప్రదర్శించిన ఆ శాఖ ఇటీవల నెమ్మదించింది. గతేడాది మార్చి చివరి నాటికి 90 శాతం పన్నులు వసూలు చేయగా, ఈ సారి 83 శాతానికే పరిమితమయ్యారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి మరో రెండు రోజుల గడువు మాత్రమే మిగిలి ఉంది. ఇంకా 17 శాతం వరకు పన్నులు వసూలు చేయాల్సి ఉంది. గ్రామ పంచాయతీల్లో పాలకవర్గాల పాలన ఫిబ్రవరి నాటికి పూర్తి కాగా, ఆ తర్వాత ప్రత్యేక పాలన కొనసాగుతున్నది. అసెంబ్లీ ఎన్నికలతో పాటు, పార్లమెంటు ఎన్నికల విధుల భారం ఉన్నప్పటికీ జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు పన్నుల వసూలులో లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేస్తున్నారు. కొన్ని పంచాయతీల్లో ఇప్పటికే ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది సమష్టిగా పని చేసి పన్నుల వసూలును 90 శాతానికి పైగా పూర్తి చేశారు.

లక్ష్యాన్ని చేరుకోవడం కష్టమే..

2023-24 ఆర్థిక సంవత్సరం ఈ నెల 31తో ముగియనుండగా, రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 17 శాతం పన్నులు వసూలు చేయడం కష్టమేనంటున్నారు. జిల్లాలో 396 గ్రామ పంచాయతీలు, 1,80,916 నివాసాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా రూ.10,37,65,639 పన్ను రూపంలో వసూలు చేయాల్సి ఉండగా, ఇందులో ఇప్పటి వరకు రూ.8,75,47,441 మాత్రమే వసూలు చేశారు. ఇంటి పన్నులతో పాటు నాన్ ట్యాక్స్‌కు సంబంధించిన పన్నులు కలిపి మొత్తం 83 శాతం వరకు పూర్తయ్యాయి. ఇంకా రెండు రకాల పన్నులు కలిపి రూ.1.62 కోట్లు వసూలు చేయాల్సి ఉన్నది. మొదట్లో ఇంటి పన్నుల వసూలు వేగంగా సాగినప్పటికీ, అసెంబ్లీ ఎన్నికలు రావడంతో బ్రేక్ పడింది. ఎన్నికల తర్వాత అధికారులు మళ్లీ దృష్టి పెట్టారు. దీంతో జిల్లాలోని పెంబి మండలంలో 98, దస్తూరాబాద్ 94, ఖానాపూర్ 94, సోన్ 93, కుంటాల 92, దిలావర్‌పూర్ 90 శాతం పన్నుల వసూలుతో ముందు వరుసలో ఉన్నాయి. ముథోల్ మండలం 55 శాతం, కుభీర్ మండలం 73 శాతంతో వెనుకబడి ఉన్నాయి.

అనుమతులన్నీ ఆన్‌లైన్‌లోనే...

గ్రామ పంచాయతీల్లో పారదర్శకత పెంచేందుకు కేసీఆర్ ప్రభుత్వం అన్ని రకాల సేవలను ఆన్‌లైన్ విధానంలోకి తీసుకొచ్చింది. ఇండ్ల అనుమతులు, పన్నులు, నాన్ ట్యాక్స్‌లు ఆన్‌లైన్‌లోనే వసూలు చేస్తున్నారు. కాగా ఇంటి పన్నులే పంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరు. ఇళ్ల అనుమతులు, జరిమానాలు, సంతల ద్వారా వచ్చే ఆదాయం, వ్యాపార సముదాయాలకు విధించే జరిమానాలు, పన్నులు, అనుమతులు తదితర సేవల ద్వారా సమకూరే నిధులను నాన్ ట్యాక్స్‌ల కింద లెక్కిస్తారు. అయితే ఇంటి పన్నుల వసూలులో పారదర్శకత ఉన్నప్పటికీ, నాన్ ట్యాక్స్‌ల వసూలు విషయంలో చాలా చోట్ల ఆరోపణలు వినిపిస్తున్నాయి. పంచాయతీల పరిధిలోని వ్యాపార సముదాయాలకు పంచాయతీల పాలక వర్గాలు సక్రమంగా పన్నులను విధించడం లేదనే విమర్శలు ఉన్నాయి.

లక్ష్యాన్ని చేరుకుంటాం...

-శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి, నిర్మల్

జిల్లాలో పన్నుల వసూలు 83 శాతం దాటింది. నాన్ ట్యాక్స్ వసూలు చేయడంలో కాస్త వెనుకబడ్డాం. ఇంకా రెండు రోజుల గడువు ఉన్నది. దాదాపుగా లక్ష్యాన్ని చేరుకుంటాం. ఆ దిశగా మా సిబ్బంది కృషి చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులపై పని భారం అధికంగా ఉన్నది. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సక్రమంగా పన్నులు చెల్లించినప్పుడే నాణ్యమైన సేవలు అందుతాయి. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే అవకాశం ఉంటుంది. పన్నులు కడితేనే ప్రజల్లో జవాబుదారీతనం పెరుగుతుంది.

రైళ్లలో పోలీసుల తనిఖీలు

తనిఖీలు చేస్తున్న పోలీసులు

తాంసి(తలమడుగు), మార్చి 29: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాలతో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. తలమడుగు మండలంలోని ఉండం, కోసాయి రైల్వే స్టేషన్‌లో ఆగిన ప్యాసింజర్ ట్రైన్‌లో పోలీసులు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివరాం మాట్లాడుతూ మహారాష్ట్ర నుంచి అక్రమంగా మద్యం, దేశీదారు జిల్లాలోకి ప్రవేశించకుండా తనిఖీలు చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం అంతర్రాష్ట్ర రహదారిపై వాహనాలు కూడా తనిఖీ చేసినట్లు తెలిపారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మద్దతు ధరకే శనగల కొనుగోలు

జిల్లా సహకార సంఘం అధికారి మోహన్

జైనథ్, మార్చి 29: ప్రభుత్వ రంగ సంస్థ మార్క్‌ఫెడ్ ద్వారా శనగ పంటను మద్దతు ధర క్వింటాలుకు రూ.5440తో కొనుగోలు చేస్తున్నట్లు జిల్లా సహకార సంఘం అధికారి మోహన్ తెలిపారు. మండలకేంద్రంలోని మార్కెట్ యార్డులో శనగ కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన శనగ పంటను ఎండబెట్టుకొని మార్కెట్‌కు తీసుకురావాలన్నారు. పట్టా పాస్‌బుక్, ఆధార్, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలను వెంట తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి మధుకర్, సీఈవో గంగన్న, ఆత్మారం, సహకార సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా అధికారి మోహన్

రూ. 3 లక్షలు పట్టివేత

సారంగాపూర్, మార్చి 29: మండలంలోని సిరిపెల్లి చెక్‌పోస్టు వద్ద శుక్రవారం ఎస్ఐ చంద్రమోహన్ రూ. 3 లక్షలు పట్టుకున్నారు. చెక్‌పోస్టు వద్ద నిర్మల్-మహారాష్ట్ర రహదారి గుండా వచ్చే వాహనాలను తనిఖీ చేస్తుండగా, కుభీర్ మండలానికి చెందిన బట్టని రాములు తన కారులో రూ. 3 లక్షలు తీసుకెళ్తుండగా,స్వాధీనం చేసుకున్నారు. డబ్బులకు ఎలాంటి పత్రాలు లేనందునా, సీజ్ చేసి కలెక్టర్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

జైనథ్, మార్చి 29: పిప్పర్‌వాడ టోల్ ప్లాజా వద్ద ఉన్న అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద రూ.లక్ష శుక్రవారం అధికారులు సీజ్ చేశారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేశారు. సీఐ సాయినాథ్, ఎస్ఐ పురుషోత్తం, ఎస్ఎస్‌టీ సభ్యులు పాల్గొన్నారు.

సిరిపెల్లి చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్న నగదు

నిఘా పటిష్టం

● ఎన్నికల వేళ అప్రమత్తంగా పోలీసులు ● ఆరు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల ఏర్పాటు
● ఎక్కడికక్కడ పూర్తిస్థాయి తనిఖీలు ● మద్యం, నగదు, గంజాయి రవాణాకు అడ్డుకట్ట
● గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు ● సమస్యాత్మక ప్రాంతాలపై నజర్

రైలులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఆదిలాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ): జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి పోలీసు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల్లో నగదు, మద్యం, గంజాయి, ఇతర ప్రలోభాలకు అడ్డుకట్ట వేసేందుకు పూర్తిస్థాయిలో తనిఖీలు చేస్తున్నారు. మహారాష్ట్రలోని నాందేడ్, యావత్మాల్, చంద్రపూర్ జిల్లాలు ఆదిలాబాద్ జిల్లాను ఆనుకొని ఉంటాయి. పక్కరాష్ట్రం నుంచి నగదు, మద్యం, గంజాయి, నిషేధిత వస్తువులు జిల్లాలోకి రాకుండా ఆరు చెక్‌పోస్టులను పోలీస్ అధికారులు ఏర్పాటు చేశారు. మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న జైనథ్ మండలం పిప్పర్‌వాడ, ఆనంద్‌పూర్, బేల మండలం శంకర్‌గూడ, తలమడుగు మండలం లక్ష్మీపూర్, భీంపూర్ మండలం కరంజి, బోథ్ మండలం ఘన్‌పూర్‌లో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. వీటిల్లో 24 గంటల పాటు సిబ్బంది విధులు నిర్వహిస్తూ వాహనాలు తనిఖీ చేస్తున్నారు. తనిఖీ సమయంలో వీడియో తీస్తున్నారు. జిల్లాలో కూడా రెండు అంతర్ జిల్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. నేరడిగొండ మండలం రోల్‌మామడ, ఉట్నూర్ మండలం ఉట్నూర్ ఎక్స్‌రోడ్ వద్ద వీటిని ఏర్పాటు చేసి, తనిఖీలు చేస్తున్నారు.

తలమడుగు మండలం లక్ష్మీపూర్ చెక్‌పోస్టులో తనిఖీ వివరాలను పరిశీలిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

కేంద్ర బలగాల కవాతు

ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును పూర్తిస్థాయిలో వినియోగించడానికి పోలీసులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు రెండు కంపెనీల కేంద్ర బలగాలు చేరుకోగా, జిల్లా పోలీసులు వారితో కలిసి కవాతు నిర్వహిస్తున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై కూడా పోలీస్ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచిస్తున్నారు. జిల్లాలో లైసెన్స్ ఉన్న వారు తమ ఆయుధాలు అప్పగించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. అక్రమ మద్యం రవాణాతో పాటు బెల్ట్‌షాపుల్లో విక్రయాలు జరుగకుండా చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు రూ.4.69 లక్షల విలువైన 700 లీటర్ల మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసున్నారు. తనిఖీల్లో భాగంగా రూ.2 లక్షల నగదు, కిలోన్నర గంజాయిని కూడా పట్టుకున్నారు. మద్యం, దేశీదారు రవాణా జరగకుండా రైళ్లతో పాటు రైల్వే స్టేషన్లలో కూడా తనిఖీలు చేస్తున్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు రూ.50 వేల కంటే ఎక్కువ తమ వెంట తీసుకుపోవద్దని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఎక్కువ నగదు వెంట తీసుకెళ్తే సంబంధిత పత్రాలు చూపించాలని అధికారులు కోరుతున్నారు. చెక్‌పోస్టుల్లో తనిఖీలను ఎస్పీ గౌస్ ఆలం క్రమంగా పర్యవేక్షిస్తున్నారు. విధుల్లో ఉన్న సిబ్బందికి అవసరమైన సలహాలు, సూచనలు చేస్తున్నారు. జిల్లాలో శాంతియుత వాతావరణంలో ఎన్నికలు పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలను జిల్లా పోలీస్ అధికారులు తీసుకుంటున్నారు.

దిగుబడులు అంతంతే..

● బోర్ల కింద సాగులో ఎదగని వరి
● గత యాసంగిలో చేతికి అధిక పంట
● ప్రస్తుతం సహకరించని వాతావరణం
● పెట్టుబడి కూడా వెళ్లని పరిస్థితి
● అన్నదాతలో దిగులు

వెంగ్వాపేట్‌లో ఎదుగుదల లోపించిన వరి పంట

సోన్, మార్చి 29: మండలంలో ఎడెనిమిదేళ్ల కిందట ఎకరాలో వరి పంటను సాగు చేస్తే, దాదాపు 25 నుంచి 28 క్వింటాళ్ల ధాన్యం పండించేవారు. కానీ ప్రస్తుతం పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా తయారైంది. 15 నుంచి 20 క్వింటాళ్ల ధాన్యం కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఈ యాసంగి సీజన్‌లో బోర్ల కింద సాగు చేసిన వరి పంట ఎదుగుదల లేక వేసిన కర్ర వేసినట్టే ఉందని, పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని అన్నదాతలు వాపోతున్నారు. గతంలో వానకాలం సీజన్ కంటే రబీ సీజన్‌లో నాణ్యమైన దిగుబడులు వచ్చేవి. ఇక యాసంగి పంట కోసం డిసెంబర్‌లో రైతులు నాట్లు వేయగా, మూడు నెలలు కావస్తున్నా కర్ర పెరగకపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. వరి పంట ప్రస్తుతం పొట్ట దశకు చేరుకుందని కానీ కర్ర పెరగకపోవడంతో దిగుబడులపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మల్, సోన్ మండలాల్లో వరి 16వేల ఎకరాల వరకు విస్తీర్ణం ఉండగా, నిర్మల్ మండలంలోని వెంగ్వాపేట్, చిట్యాల్, డ్యాంగాపూర్, నీలాయిపేట్, రత్నాపూర్‌కాండ్లీ, అక్కాపూర్, ముజ్గి, సోన్ మండలంలోని న్యూవెల్మల్, బొప్పారం, మాదాపూర్, పాక్‌పట్ల, కడ్తాల్, సాకెర, తదితర గ్రామాల్లో వరి పంటను బోర్లు, చెరువులు, సరస్వతీ కెనాల్ ద్వారా వరి పంటను సాగు చేస్తున్నారు.

అనుకూలించని వాతావరణం

గతంలో వరి సాగులో రైతులు సంప్రదాయ వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ క్రిమిసంహారక మందులు కూడా పిచికారీ చేస్తుండేవారు. అయితే ఇప్పుడు వాతావరణ పరిస్థితుల్లో పలు మార్పులు చోటు చేసుకోవడంతోనే వరి దిగుబడుల్లో గణనీయమైన తేడాలు ఉంటున్నాయని వ్యవసాయశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. మరోవైపు రైతులు అధిక దిగుబడుల కోసం మోతాదుకు మించి క్రిమిసంహారక మందులు, రసాయన ఎరువులు వాడడంతో భూసారం కాలక్రమేణ తగ్గుతూ వస్తున్నది. బోరుబావులు, కాలువలు, చెరువుల కింద సాగు చేసే రైతన్నలు పంట దిగుబడుల కోసం వ్యవసాయశాఖ అధికారుల సూచనలు స్వీకరించకుండా సొంతంగానే ఇష్టారీతిన మందులను పిచికారీ చేయడం కూడా మరో కారణంగా భావిస్తున్నారు. ఇక వరి పంటకు సాగు నీరు ఎక్కువ మోతాదులో అవసరమవుతుండగా ప్రాజెక్టుల కింద నీటి నిల్వలు గతంలో కంటే ప్రస్తుతం పడిపోవడంతో ఇబ్బందికర పరిస్థితి ఎదురవుతున్నది. బోరుబావుల్లో కూడా నీరు లభించడం లేదు. దీనికి తోడు భూగర్భ జలమట్టం తగ్గిపోవడంతో వరి పంటకు నీటి కొరత తలెత్తుతున్నది. మరోవైపు రైతులు వరి పంటను బతికించుకోవడానికి నానాతంటాలు పడుతున్నారు.

పక్షులకు స్వర్గధామం కవ్వాల్

- ఆస్ట్రేలియా ప్రొఫెసర్ ప్రదీప్ నినాన్ థామస్

మంచిర్యాల, మార్చి 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా జన్నారంలోని కవ్వాల్ టైగర్ రిజర్వ్ పక్షులకు స్వర్గధామం అని ఆస్ట్రేలియాలోని యూనివర్సిటీ ఆఫ్ క్వీన్‌ల్యాండ్ ప్రొఫెసర్ ప్రదీప్ నినాన్ థామస్ అన్నారు. మూడు రోజులుగా కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో పర్యటించిన ఆయన గనిశెట్టికుంట, బైసన్‌కుంట, గొందుగూడ వ్యూ టవర్లు, నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో అరుదైన పక్షుల ఫొటోలను ఆయన సేకరించారు. హాక్ ఈగల్స్, క్రెస్టెడ్ సర్పెంట్ ఈగల్స్, లెస్సర్ ఫిషింగ్ ఈగల్స్ అలాంటి అరుదైన పక్షులతో పాటు జంతువుల ఫొటోలను తీసినట్లు తెలిపారు. ఇండియాలో ఇప్పటి వరకు దాదాపు అన్ని పులులు, వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలను సందర్శించానని, పక్షి వీక్షకులు తప్పకుండా సందర్శించాల్సిన ప్రాంతం కవ్వాల్ టైగర్ రిజర్వ్ అని థామస్ చెప్పారు. ఈయన అంతర్జాతీయ స్థాయిలో ప్రసిద్ధి చెందిన జర్నలిజం ప్రొఫెసర్. జర్నలిజంపై దాదాపు 12 పుస్తకాలను పబ్లిష్ చేశారు. ఖాళీ సమయాల్లో ఫొటోగ్రఫీ చేయడం తనకు అలవాటని, అందులో భాగంగానే కవ్వాల్ రిజర్వ్‌ను సందర్శించానని ఆయన తెలిపారు.

బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్

ప్రార్థనలు చేస్తున్న ముస్లిం పెద్దలు

ఎదులాపురం,మార్చి 29: ఆదిలాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న హాజరయ్యారు. ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ఒకరికొకరు పండ్లు తినిపించుకున్నారు. మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారికంగా ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసి గిఫ్ట్ ప్యాక్‌ను కూడా అందజేసిందని గుర్తుచేశారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ మైనార్టీ సంక్షేమానికి ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. మైనార్టీ గురుకులాలను ఏర్పాటు చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనన్నారు. మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు యూనిస్ అక్బానీ, సాజీదుద్దీన్, అష్రఫ్, సలీంపాషా, ఎజాజ్, లాలా, ఎంఐఎం పార్టీ పట్టణాధ్యక్షుడు నజీర్ హైమద్, ముస్లిం మత పెద్దలు, మైనార్టీ నాయకులు ఉన్నారు.

ముస్లింలకు పండ్లు తినిపిస్తున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న